రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న ఉమామహేశ్వరిరెడ్డి

అత్తాపూర్: క్షతగాత్రుల అవసరాల కోసం రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బీజేపీ సీనియర్ నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం రక్తదానం చేశారు. మిత్ర వాలంటరీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కొనసాగింది. ఇప్పటి వరకు 52 సార్లు రక్తదానం చేసినట్లు ఆమె తెలిపారు.

ఎంపీని సన్మానించిన కార్పొరేటర్



ఎంపీని సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి ఎంపీ ఈటల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో బీజేపీ బలపడింది

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్



నరసింహారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: భారతీయ జనతా పార్టీకి 9 సంవత్సరాల పాటు జిల్లా అధ్యక్షునిగా పనిచేసిన బొక్క నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అన్ని మండలాల్లో బలపడిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నరసింహారెడ్డిని సన్మానించారు. మరో వ్యక్తిని అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. ఈ సందర్భంగా నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందరావు, వెంకటేష్, శివకుమార్, రాఘవరెడ్డి, శంకర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజ్ భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్‌ను గురువారం నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, జోగి రవి, డి.సత్యనారాయణ ముదిరాజ్, బొక్క బాల్ రెడ్డి, సాబాద విజయ్ కుమార్, నార్లట్ల జగన్, కాకులారం కృష్ణ, నల్లింగ్ రమేశ్, కె.కిరణ్ చారి, శంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్: రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్‌ను అత్తాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో చేవెళ్ల కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, కృష్ణ, సాబాద విజయ్‌కుమార్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు ఎరుపు రంగు కళ



గోల్కొండ: గోల్కొండ కోట ఎరుపు రంగులో కొత్త శోభను సంతరించుకుంది. టీబీ నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చారిత్రక కట్టడాలను ప్రతినెల 24న ఎరుపు రంగు విద్యుత్ దీపాలతో అలంకరిస్తుంది. 'నీ-క్షయ' కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా గోల్కొండ కోటను ఎరుపు రంగు విద్యుత్ దీపాలతో గురువారం అలంకరించామని గోల్కొండ కోట పర్యవేక్షణ అధికారి మల్లేశం తెలిపారు.

నేటి నుంచి పది పరీక్షలు

- ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ
- ప్రశ్నపత్రాలపై మొదటిసారి క్యూఆర్ కోడ్

మణికొండ: పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మొదలయ్యే పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా సకాలంలో సిలబస్‌లను పూర్తి చేసుకుని రివిజన్ చేసుకోవటం, ప్రత్యేక తరగతులతో మరింత పట్టు సాధించారు. పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానుండటంతో విద్యార్థులు, తల్లితండ్రులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సారి ప్రశ్నా పత్రాలపై క్యూఆర్ కోడ్‌లతో పాటు ప్రతి పేజీపైన సీరియల్ నెంబర్లను ప్రచురించారు.

మండలాల వారీగా విద్యార్థులు

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో మొత్తం 170 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8771 మంది విద్యార్థులు 38 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు. గండిపేట మండల పరిధిలో 45 పాఠశాలలకు చెందిన 2,563 మంది విద్యార్థులు 11 కేంద్రాలలో, రాజేంద్రనగర్ మండల పరిధిలో 84 పాఠశాలలకు చెందిన 5004 మంది విద్యార్థులు 22 కేంద్రాలలో, శంషాబాద్ మండల పరిధిలోని 41 పాఠశాలకు చెందిన 1204 మంది విద్యార్థులు 5 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు.



అత్తాపూర్‌లో పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఎంఈఓ

ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ

రాజేంద్రనగర్: శివరాంపల్లి పాఠశాలలో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను గురువారం రంగారెడ్డి జిల్లా డీఈవో సుశీంద్ర రావు పరిశీలించారు. శుక్రవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అనంతరం సీపీఎస్ ప్రైమరీ శివరాంపల్లి పాఠశాలకు వెళ్లి తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, రాజేంద్రనగర్ జోనల్ సెక్రటరీ గంగయ్య నాయక్, సుదర్శన్, జంగయ్య, నర్సింహాచారి, వెంకటయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రోడ్ల అభివృద్ధికి సహకరిస్తాం

మున్సిపల్ కమిషనర్‌తో కోకాపేట భూ నిర్వాసితులు

మణికొండ: రాబోయే రోజుల్లో కోకాపేట మరింత అభివృద్ధి సాధించేందుకు సహకరిస్తామని కోకాపేట భూ నిర్వాసితులు అన్నారు. గురువారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి తన కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి వేగంగా జరగాలంటే రోడ్లు వెడల్పుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రోడ్లను ఏర్పాటు చేసుకున్నప్పుడు అదే స్థాయిలో అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. భూ యజమానులు అంగీకరిస్తే హెచ్‌ఆర్‌డీసీఎల్, ఆర్‌డీపీ శాఖలు రోడ్లను అభివృద్ధి చేస్తాయన్నారు. దీంతో ప్రతి ఒక్కరూ తమ సమ్మతిని తెలిపారు. సమావేశంలో కోకాపేట మాజీ సర్పంచ్ ముంగి జైపాల్‌రెడ్డి, భూ యజమానులు పాల్గొన్నారు.



భూ యజమానులతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన నేతలు



మణికొండ: బీఆర్‌ఎస్ పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయటంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను నిలదీసేందుకు జిల్లాల పర్యటన చేపట్టిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మణికొండ మున్సిపాలిటీ నాయకులు స్వాగతం పలికారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి సూర్యాపేట జిల్లాకు వెళ్తుండటంతో పుప్పాలగూడ ఔటర్‌రింగ్ రోడ్డుపై ఆయన కాన్వాయ్‌కి స్వాగతం పలికారు. అనంతరం ఆయనతో పాటు సూర్యాపేట బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి. సీతారాం, నాయకులు కె. ధన్‌రాజ్, జి.నరేందర్, రూపారెడ్డి, ఎ.లక్ష్మణ్‌రావు, మాల్యాద్రి నాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కీర్తిలతాగౌడ్, రాజేంద్రప్రసాద్, జి.విఠల్, సుమనళిని, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ కోచ్ కృష్ణ సేవలు మరువలేం

మణికొండ: రెజ్లింగ్ రంగంలో కుర వృద్ధుడు, అంతర్జాతీయ స్థాయిలో కోచ్‌గా, రెఫరీగా బాధ్యతలను నిర్వర్తించిన కృష్ణ ముదిరాజ్‌కు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి నివాళులర్పించారు. ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్తీక్‌రెడ్డి గురువారం నార్సింగిలో మృతదేహానికి అంతిమ నివాళులర్పించారు. నార్సింగి దంగల్ నుంచి అంతర్జాతీయ దంగల్ వరకు ఎదిగిన కృష్ణ సేవలు మరవలేనివన్నారు. గండిపేట మండలాన్ని రెజ్లర్‌లకు అడ్డాగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఫరూఖ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ మృతదేహం వద్ద నివాళి అర్పించిన కార్తీక్‌రెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మైలార్‌దేవ్‌పల్లి: కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ డిమాండ్ చేశారు. కాటేదాన్ పారిశ్రామికవాడ ప్రాంతంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు రోడ్లపై చెత్తాచెదారాలు తొలగిస్తు రోడ్లు, బస్తీలు, కాలనీలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికుల పట్ల వివక్ష చూపొద్దన్నారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో కేవలం 13 మంది మాత్రమే శానిటేషన్ సిబ్బంది ఉన్నారని, పరిశ్రమల ఆధారంగా సిబ్బందిని పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందించాలన్నారు. రూ.19,600 వేతనం అమలు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించకుంటే ఐలా ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గోల్కొండ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇఫ్తార్ విందు

గోల్కొండ: గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరబిక్, ఉర్దూ విద్యార్థినులు రంజాన్ ప్రాముఖ్యతను వివరించే వివిధ రకాల చార్ట్‌లు, కటౌట్లు తయారు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపవాస దీక్ష వలన కలిగే శాస్త్రీయ ప్రయోజనాలను ప్రిన్సిపాల్‌కు వివరించారు. 5 పూటల నమాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను కటౌట్లపై అందంగా రాసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుమేరాసైద్ అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.ఎస్. రజనీష్, అరబిక్ విభాగం అధిపతి డాక్టర్ మన్సూర్ హుస్సేన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బ్రయిటన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో..

యాకుత్‌పురా: రెయిన్ బజార్‌లోని బ్రయిటన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పేద ప్రజలకు రేషన్ కిట్స్ పంపిణీ చేశారు. రెయిన్ బజార్, తలాబ్ చంచలం, సంతోష్ నగర్ కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, డాక్టర్ సమీనా బేగం, ముజఫర్ హుస్సేన్, పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



చాట్‌ను పరిశీలిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి

సులేమాన్ నగర్‌లో ఇఫ్తార్ విందు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్ నగర్‌లో గురువారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, డి రమేష్, పి రమేష్ చారి, ముస్లింలు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షులు శివ కుమార్ మృతి



కోరని శివ కుమార్

రాజేంద్రనగర్: బీజేపీ ఎస్సీ మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు కోరని శివ కుమార్ (35) గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతి వార్త తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు బంధుమిత్రులు ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. శివ కుమార్ అంత్యక్రియలను శుక్రవారం రాజేంద్రనగర్ కృషి పాఠశాల ప్రాంతంలోని హిందూ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మణికొండ: రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. నార్సింగి ఏఎస్‌ఐ బుచ్చయ్య గౌడ్ వివరాల ప్రకారం.. ఖానాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పక్కన ఓ వ్యక్తి పడి ఉన్నాడని సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతను కాలకృత్యాలకు వెళ్లే క్రమంలో రాయిపై పడి చనిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. అతని ఎడమ కనతకు గాయమై ఉంది. స్థానికంగా ఎవ్వరూ గుర్తించక పోవటంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి అదృశ్యం



సత్తమ్మ

శంషాబాద్ రూరల్ : మతి స్థిమితం లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన సూరంపల్లి సత్తమ్మకు మతిస్థిమితం సరిగా లేదు. కొంత కాలంగా ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆమె ఈ నెల 19న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా స్థాయి పోస్టర్ విడుదల

చార్మినార్ : 'వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2025'లో భాగంగా ఈనెల 21, 22న సిటీ కాలేజీలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. గురువారం పోస్టర్ విడుదల చేశారు. హైదరాబాద్ నోడల్ కేంద్రంలో యువత పంపిన వీడియోలను స్క్రూటినీ చేసి 150 మంది ప్రతిభావంతులైన యువతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి కళాశాల విద్యాశాఖ సంచాలకుడు ఆచార్య రాజేందర్ సింగ్ అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన 10 మంది రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి డా. డి. నాగరాజు సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు. సృజనాత్మకతను వెలికితీసే వేదికగా ఇది నిలుస్తుందని ఆయన తెలిపారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



ఫిట్ నెస్ స్టూడియోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్: వ్యాయామానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్‌లో ఆస్ట్రా వన్ ఫిట్ నెస్ స్టూడియోను శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్నెస్‌ను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. వ్యాయామంతోనే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చని స్వామిగౌడ్ చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆస్ట్రా వన్ ఫిట్ నెస్ స్టూడియోను కిస్మత్ పూర్ లో ప్రారంభించినట్టు యజమాని ప్రవీణ్ తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, స్వామి గౌడ్ కాసేపు వర్కౌట్స్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, సురేష్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక

బండ్లగూడ: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువులో అబ్దుల్ సాధిక్ ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, సుమన్‌గౌడ్, ముస్లింలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీ

శంషాబాద్ రూరల్ : హమీదుల్లానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు పట్టాలను గురువారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అందజేశారు. ఇళ్ల కేటాయింపు జరిగి ఏడాదిన్నర తర్వాత పట్టాలు అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. 20 మందికి పట్టాలు పంపిణీ చేశారు.

కళాశాలలో టెక్నోమిస్ట్-2025



టెక్నోమిస్ట్‌లో కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సీడీఏసీ జాయింట్ డైరెక్టర్ శరణ్ బాసప్ప

మైలార్‌దేవ్‌పల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికితీయాలని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. కళాశాల సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవం సందర్భంగా గురువారం టెక్నోమిస్ట్-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 30 కళాశాలలకు చెందిన విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ప్రదర్శన, నూతన ఆవిష్కరణలపై ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సీడీఏసీ జాయింట్ డైరెక్టర్ శరణ్ బాసప్ప వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉషశ్రీ, చైర్మన్ ఎస్.జయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, కోశాధికారి అగ్నిహోత్రి, హెచ్‌వోడీలు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశు మందిర్ పాఠశాల 42వ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 42వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాగ్యనగర్ విభాగ్ రంగారెడ్డి జిల్లా పాఠశాల అధ్యక్షులు ఎస్.అమరేందర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ చల్లా వివేకానందరెడ్డి ధ్వజారోహణం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, విద్యాపరమైన, కళాత్మక అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, తకమూరి శ్రీనివాసరావు, తెలంగాణ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కె.లింగయ్య, పర్వతనేని యుగంధర్ రెడ్డి, కాసోజు భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో భాగ్యనగర్ విభాగ్ జిల్లా పాఠశాల అధ్యక్షులు ఎస్.అమరేందర్ తదితరులు



ఎస్సీ వర్గీకరణ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం అంజన్న మాదిగ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్.సాయిలు, ఉపాధ్యక్షులు డి.అంజి, ప్రధాన కార్యదర్శి డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు. - రాజేంద్రనగర్

అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

శంషాబాద్: అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. బీసీల 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి గతంలో ఏ ప్రభుత్వం చేయని పనిని కాంగ్రెస్ సర్కారు చేసి చూపించిందన్నారు. ఏడాదిన్నర వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు మించి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్‌యాదవ్, మైలారం సులోచన, పరమేష్, గని, కరుణాకర్‌గౌడ్, కుమార్, శేఖర్, జగన్, అక్రమ్, గణేష్, కోటీశ్వర్, గుంటి ప్రవీణ్‌కుమార్, రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల రాజేంద్రనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ విగ్రహాలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేము రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తల్లారి మల్లేష్, జ్యోతిబా పూలే వ్యవస్థాపక అధ్యక్షులు చారి, పూలే కమిటీ సభ్యులు శంకర్, యాదయ్య, అర్జున్, శ్రీనివాస్, రఘు, కొండల్, గణేష్, రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లలిత్, ఉమామహేశ్వరి, శ్రీకాంత్, రవి, విద్యార్థి నాయకులు చంద్రశేఖర్, శివ, దయాకర్, వంశీ, విప్లవ్, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు